యూనిట్ 3

# 12. విహారయాత్ర

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**




★ చిత్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారు?

★ పిల్లలు బస్సు ఎక్కి ఎక్కడకు వెళుతున్నారు? మీరు ఎప్పుడైనా ఇలా వెళ్ళారా? ఎక్కడికి?

★ మిమ్మల్ని విహారయాత్రకు తీసుకెళతామంటే ఏ ఏ ప్రదేశాలు చూడాలని కోరుకుంటారు?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**శనివారం, 12 నవంబరు 2011**

**ఉదయం 6 గంటలయింది.**

నాకెంతో ఆనందంగా ఉంది. నేనేకాక, నా మిత్రులు శ్రీను, రఘు, సోము అందరం ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. అందరం రెండు రోజుల విహారయాత్రకు వెళ్తున్నాం. మా సామాన్లు, సంచులు సర్దుకొని బడిదగ్గరికి వచ్చేసరికి రంగురంగుల బస్సు మాకోసం సిద్ధంగా ఉంది.

అందరి అమ్మానాన్నలూ వచ్చి మాకందరికీ జాగ్రత్తలు చెప్తూ ఉన్నారు. సత్యంగారు, సంగీతా టీచర్ హడావిడి పడుతున్నారు. పిల్లలకు బస్సులో సీట్లు కేటాయిస్తున్నారు. బలే బలే!.... నాకు కిటికీ దగ్గరే సీటు దొరికింది. ఎంతో గొడవ గొడవగా ఉంది. ఇక బస్సు బయలుదేరుతుందనగా మా నాన్నమ్మ ఆయాసపడుతూ పరుగెత్తుకువచ్చింది. 'ఒరే చందూ!' అంటూ కేకలుపెడుతూ నాకోసం వెదుకుతూ ఉంది. "నాన్నమ్మా!" అని నేను పిలిచేసరికి వచ్చి పెద్దపొట్లం నా చేతిలో పెట్టి "లడ్డూలూ, చక్కిలాలూరా — మరిచిపోయావు. నలుగురూ కలిసి తినండి," అన్నది. ఆమె ఆయాసపడుతూ మాట్లాడుతూ ఉంటే నాకు ఎంత బాధ కలిగిందో! మా నాన్నమ్మకు నేనంటే ఎంతో ఇష్టం. "చందూ! ఎక్కడా నీళ్ళలో దిగకు నాన్నా!" అంది నాన్నమ్మ. సరేనని తలూపాను.

మా మానుకోటనుంచి బస్సు కదిలేముందు రవి పరుగెత్తుకొని వచ్చి బస్సు ఎక్కాడు. వాడి బ్యాగును శ్రీధర్‌గారు అందుకొని పైన సర్దారు. బస్సులో పాటలు వచ్చినవాళ్ళు పాడుతూ ఉంటే తక్కినవాళ్ళు చప్పట్లు కొడుతూ గొంతు కలిపారు.

**ఉదయం 8 గంటలు అమరావతి**


అమరావతిలోని బౌద్ధస్తూపం

దిగండి! దిగండి! అంటూ విజిల్ వేశారు రామంగారు. అమరావతి బౌద్ధస్తూపం ఎంత బాగుందో! ఈ స్తూపంలో బుద్ధుడి అస్థికలు ఉన్నాయట. అక్కడున్న గైడ్ మాకన్నీ చెబుతున్నాడు. గైడ్‌ని తెలుగులో మార్గదర్శి అంటారని సారు చెప్పారు. కొంతమంది చారిత్రక విషయాలను ఆసక్తితో రాసుకున్నారు. దగ్గరలో ఉన్న ధ్యానబుద్ధుడి ఎత్తైన విగ్రహాన్ని చూశాం. ఎంత పెద్దదో! ఇక్కడి మ్యూజియంకంటే నాగార్జునసాగర్‌లో ఉన్న బౌద్ధమ్యూజియం పెద్దదని గైడ్ చెప్పాడు. వెంటనే అమరేశ్వరుడి ఆలయానికి వెళ్ళాం. ఇది పంచారామాలలో ప్రసిద్ధమైన శైవక్షేత్రం. కృష్ణానది ఒడ్డున అందమైన శిల్పాలతో ఎంత విశాలంగా ఉందో! అందరం దేవుణ్ణి దర్శించుకున్నాం.


బస్సు ఎక్కేముందు నాన్నమ్మ పెట్టిన లడ్డూలు, చక్కిలాలు నేనూ సోమూ రఘూ తిన్నాం. "అందరూ వచ్చారా?" అని రామంసార్ లెక్కపెట్టుకుంటున్నారు. తరవాత ఈల వేశారు. బస్సు కదిలింది. ఉండవల్లి గుహలదగ్గరికి చేరుకున్నాం. మా ఉపాధ్యాయులు రామంగారు, శ్రీధర్‌గారు, సంగీత టీచరుగారు, సత్యంగారు అందరూ దారి చూపిస్తూంటే ఉండవల్లి గుహలన్నీ చుట్టివచ్చాం. రాతిలో తొలిచిన ఈ గుహల్లో అనంతపద్మనాభస్వామి విగ్రహం ఉంది.

బస్సు బయల్దేరింది. దారిలో మంగళగిరిలో పానకాల లక్ష్మీనరసింహస్వామి గుడి చూశాం. మంగళగిరి చేనేత చీరలకు ప్రసిద్ధి అని శ్రీధర్ గారు చెప్పారు. నేను సారును అడిగి అమ్మకు, నాన్నమ్మకు ఇక్కడి చీరలు రెండు కొనిపించుకొని సంచిలో పెట్టుకున్నాను.

### మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ

ఇక్కడే మేము భోజనాలు చేశాం. మంగళగిరినుంచి విజయవాడ రావాలంటే ప్రకాశం బ్యారేజి దాటాలి. నేనున్న కిటికీలోనుంచి చూస్తే మన్నుతిన్న పాము పడుకొని ఉన్నట్లుంది. మమ్మల్ని బస్సు దిగి బ్యారేజి చూడమని 15 నిమిషాల్లో తిరిగి రమ్మని అన్నారు. నాకైతే చాలాసేపు నిలబడాలనిపించింది కానీ ఎండ మండిపోతున్నది.

విజయవాడలోని కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజి




విజయవాడలో కనక దుర్గమ్మ గుడి



ఆ ఎండలోనే మెట్లెక్కి కనకదుర్గమ్మ ఆలయాన్ని చేరి అమ్మవారిని దర్శించుకొని త్వరత్వరగా కిందికి వచ్చాం. రాత్రి విజయవాడలోనే పడుకొన్నాం.

### ఆదివారం 13, నవంబర్ 2011

కొత్తగూడెంలోని సింగరేణి బొగ్గు గనులు



విజయవాడలో ఉదయం అల్పాహారం తిని, పది గంటలకు కొత్తగూడెం చేరుకున్నాం. కొత్తగూడెంలో మేము బొగ్గుగనులు చూశాం. నిజానికి స్కూలు పిల్లలకు అనుమతి లేదట. మా ప్రధానోపాధ్యాయులు అక్కడి ఏరియా మేనేజరుగారికి లేఖ రాసి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. బొగ్గుగని లోపలకూ వెళ్ళివచ్చాం. రెండు వైపులా బొగ్గుగోడలు కనపడుతున్నాయి. తవ్విన బొగ్గును ట్రాలీలలో నింపి బయటకు తీసుకొని వస్తారు. లోపల కార్మికులందరూ లైట్లున్న ఇనుపటోపీలు (హెల్మెట్లు) ధరించిఉన్నారు. తవ్విన ఈ బొగ్గు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు పంపుతారనీ దానితో విద్యుత్తు ఉత్పత్తిచేస్తారనీ మా ఉపాధ్యాయులు చెప్పారు. అక్కడినుంచి భద్రాచలం వెళ్ళాం.

### సాయంకాలం 4.45 గంటలకు భద్రాచలం

కొత్తగూడెంనుంచి భద్రాచలం వెళ్ళాలంటే గోదావరిమీద ఉన్న రోడ్డువంతెనను దాటాలి. భద్రాచలం పట్టణంలో ప్రవేశించేటప్పుడు పెద్ద హనుమంతుడి విగ్రహం మనల్ని రమ్మని పిలుస్తున్నట్లుగా ఉంటుంది.

భద్రాచలం రాములవారి గుడి



"రామాలయం మూసేస్తారు; త్వరగా నడవండని ఉపాధ్యాయులు మమ్మల్ని తొందరపెట్టారు. సీతారాములను దర్శించుకున్నాం. ఈ దేవాలయాన్ని తానీషాకాలంలో తహసీల్దారుగా పనిచేసిన కంచర్ల గోపన్న కట్టించాడని సంగీత టీచరు చెప్పారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

అందుకే అతనికి 'భక్త రామదాసు' అని పేరు వచ్చిందట. "ఈ పేరున్న సినిమా మీరు చూడలేదా?" అని శ్రీధర్ గారు అడిగారు. "చూడలేదు" అని చెప్పాను.

గుడినుంచి బయటికి వచ్చి గోదావరి ఒడ్డుకు బయల్దేరాం. గోదావరి నదిని చూశాం. గోదావరి కట్ట మీద అందమైన విగ్రహాలు ఏర్పాటు చేశారు. రాత్రి లైట్ల వెలుతురులో కట్ట మీద నడుస్తుంటే ఎంత బాగుందో! రాత్రి భద్రాచలంలోని రామసదనంలో భోజనాలు చేశాం. ఆ రాత్రికి భద్రాచలంలో బసచేశాం.

### సోమవారం, 14 నవంబర్ 2011

నర్సంపేట దగ్గర పాకాల చెరువు



ఉదయం 5 గంటలకే లేచి 6 గంటలలోపున అందరం తయారయాం. బస్సెక్కి ముందుగా 'పర్ణశాల'కు చేరుకున్నాం. ఇక్కడే సీత బంగారులేడిని చూసిందని చెప్తారు. ఆ కథను వివరించే బొమ్మలు అక్కడఉన్నాయి. అక్కడినుంచి బయలుదేరి పాల్వంచమీదుగా ప్రయాణం చేసేటప్పుడు అక్కడున్న పెద్ద థర్మల్ విద్యుత్‌కేంద్రం కనపడింది. ఇక్కడినుంచి విద్యుత్తు సరఫరా చేస్తారని ఉపాధ్యాయులు చెప్పారు. అక్కడినుంచి ఇల్లెందుమీదుగా 'పాకాల' చెరువుకు చేరుకున్నాం. పాకాలచెరువు పెద్దగా సముద్రంలా కనపడింది. మరో పక్క అభయారణ్యం ఉంది. ఇది వన్యమృగ సంరక్షణ కేంద్రం. వన్యమృగాలు అంతరించిపోతున్నాయి కాబట్టి వాటిని రక్షించుకోవాలని ఇటువంటి కేంద్రాలు పెడతారని సత్యంగారు చెప్పారు. పాకాల చెరువు దగ్గరే మధ్యాహ్నం భోజనం చేశాం. భోజనం తరవాత వరంగల్లు బయలుదేరాం.

### సాయంత్రం 5.00 గంటలు

హనుమకొండలో వెయ్యి స్తంభాల గుడి



హనుమకొండలో వెయ్యిస్తంభాల గుడి చూశాం. ఒకప్పటి ప్రసిద్ధమైన శివాలయం ఇది. పక్కనే ఒక కోనేరు ఉంది. అందులో నీళ్ళు పెద్దగా ఏమీ లేవు. దేవాలయం ఎదుట ఒక పెద్ద మండపం ఉంది. రెండింటి మధ్యా ఒక నల్లని ఎత్తైన నంది విగ్రహం ఉంది. మొదట నేను, నిజంగానే అక్కడ శివుడి నంది కూర్చుని ఉంది అనుకున్నాను. చీకటి పడేవరకు వెయ్యి స్తంభాల గుడిలోనే తిరిగాం. హనుమకొండలో భోజనం చేశాం. తరవాత ప్రతాపరుద్ర హిందుజా నక్షత్రశాలలో మాకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రదర్శన చూశాం. తరవాత పక్కనే ఉన్న భద్రకాళి గుడికి కూడా వెళ్లాం. అమ్మవారిని దర్శించుకున్నాం. గుడిపక్కనే పెద్ద చెరువు ఉంది. గుడిలో కూర్చుని చెరువును చూస్తుంటే అలాగే కూర్చోవాలని అనిపించింది. రాత్రి వరంగల్లులోనే భోజనాలుచేసి పడుకున్నాం.

**మంగళవారం, 15 నవంబర్ 2011**

కాకతీయ ద్వారం (ఓరుగల్లు కోట)



ఉదయం అల్పాహారంతిని వరంగల్లు కోటకు బయలుదేరాం. కాకతీయుల కోటముందు కందకాలు తవ్వి తరవాత ఒక మట్టికోట నిర్మించారని, మట్టికోట దాటినతరవాత రాతికోట వస్తుందని మేస్టరుగారు చెప్పారు. మట్టికోట దాటినతరవాత 'కాకతీయ ద్వారం' కనపడింది. ఈ ద్వారం బొమ్మని మనం చాలా పుస్తకాల్లో చూశాం. లోపలదీన్ని దాటి వెళ్తే ఒకచోట శిల్పాలన్నీ అమర్చిఉన్నాయి. చాలావరకు విరిగిపోయి ఉన్నాయి. మనం మన చారిత్రక అవశేషాలను సరిగా కాపాడుకోకపోతే మనకు చరిత్ర తెలియదు. దీన్ని ఓరుగల్లు అని, ఏకశిలానగరం అని పిలిచేవారు పూర్వం. ఆ పెద్దరాయి మీదకెక్కి చూస్తే వరంగల్లు నగరం ఎంత అందంగా కనపడిందో!


మధ్యాహ్నం భోజనాలయిన తరవాత మా ఊరికి తిరుగుప్రయాణం మొదలయింది. బస్సులోనే నిద్రపోయాం. ఖమ్మంమీదుగా రాత్రికి మా ఊరు చేరుకున్నాం. ఇది మాకు మరపురాని విహారయాత్ర!



## ఇవి చేయండి



### I వినండి - ఆలోచించి చెప్పండి




(అ) పాఠంలోని చిత్రాలు చూడండి. వాటి గురించి మాట్లాడండి.

(ఆ) మీరెప్పుడైనా విహారయాత్రకు వెళ్ళారా? మీరేమి చూశారో చెప్పండి.

(ఇ) విహారయాత్రకు వెళ్లేటప్పుడు వెంట ఏమేమి తీసుకొని వెళ్లాలి? ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

(ఈ) విహారయాత్ర విశేషాలను రాసుకున్నవారు ఎవరు? ఇలా రాయటాన్ని ఏమంటారు? మీరు కూడా ఇలా ఎప్పుడైనా రాశారా? వేటి గురించి రాశారు?

### II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి.

| | వారం | నెల | తేది | సమయం | సందర్శించిన ప్రాంతం |
|---|---|---|---|---|---|
| ఉదా: | శనివారం | నవంబర్ | 12 | ఉదయం 8 గంటలు | అమరావతి |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |

© SCERT Not to be republished

(ఆ) పాఠంలోని చివరి పేరాను చదవండి. దాని ఆధారంగా నాలుగు ప్రశ్నలు రాయండి.

(ఇ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. విహారయాత్రకు ఏ పాఠశాల నుండి వెళ్లారు? పిల్లలతో పాటు ఉపాధ్యాయులు ఎవరెవరు వెళ్లారు?
2. విహారయాత్రలో అమరావతికి వెళ్ళి అక్కడ ఏమేమి చూశారు?
3. కొత్తగూడెం థర్మల్ విద్యుత్‌కేంద్రం విశేషాలు రాయండి.
4. వరంగల్‌లో పిల్లలు ఏ ఏ ప్రాంతాలు సందర్శించారు?
5. ఏ ఏ నదులు, చెరువులు చూశారు? వాటిని ఎక్కడెక్కడ చూశారు?

## III రాయండి




(అ) మీరు ఏ ఏ ఊళ్ళు, ప్రదేశాలు చూశారు? మీ ప్రయాణ విశేషాలను, దారిలో జరిగిన ప్రత్యేక సంఘటనలు రాయండి.

(ఆ) "విహారయాత్ర" అంటే ఏమిటి? దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి పది వాక్యాలు రాయండి.


(ఇ) మన రాష్ట్రంలో చూడదగిన ప్రదేశాలు ఏవి? అవి ఎక్కడెక్కడ ఉన్నాయో రాయండి.

© SCERT not to be republished

## IV పదజాలం



(అ) కింది పదాలను చదవండి. భద్రాచలాన్ని గురించి మిగతా పదాలు ఆధారంగా ఒక పేరా రాయండి.




(ఆ) అర్థాల ఆట :

1. చిన్నచిన్న కార్డులు 20 తీసుకోవాలి. ఒక్కొక్క కార్డుపై ఒక్కొక్క పదం చొప్పున 10 కార్డులమీద పాఠంలోని పదాలు రాయాలి. మిగిలిన పదికార్డులమీద ఆ పదాల అర్థాలను ఒక్కొక్క కార్డుమీద ఒక్కొక్కటి చొప్పున రాయాలి.
2. గుండ్రంగా కూర్చుని మధ్యలో కార్డులను ఒకదాని పక్కన ఒకటి బోర్లించిపెట్టాలి.

3. ఒకరు వచ్చి రెండు కార్డులు తీసుకోవాలి. అవి పదం - దాని అర్థం ఉన్న కార్డులైతే తీసుకోండి. లేకపోతే మళ్ళీ బోర్లించిపెట్టండి.
4. ఇలా వరసగా కార్డులు అయిపోయేవరకు ఆటను కొనసాగించండి.
5. ఎక్కువ కార్డులు వచ్చినవారిని విజేతగా ప్రకటించాలి.

## V సృజనాత్మకత



**(అ) ఉదయం లేచినప్పటినుంచి పడుకోబోయేవరకు మీరు ఏమేమి చేశారో దినచర్య రాయండి.**

**(ఆ) పాఠశాలలోని కథలపుస్తకాలలో మీరు చదివిన కథల గురించి డైరీలో రాయండి.**

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) మీకిష్టమైన ప్రదేశాన్ని చూడటానికి ముందుగా ప్రణాళికను సిద్ధం చేయండి.**

**(ఆ) ముఖ్యమైన దర్శనీయ ప్రదేశాల ఫోటోలు సేకరించి, గోడపత్రికలో పెట్టండి. (ఆల్బమ్ తయారీ)**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన అక్షరాలను గమనించండి.**

పరుగు పందెంలో రాణికి మొదటి బహుమతి వచ్చింది, అంజుకు రెండవ బహుమతి వచ్చింది.

పై వాక్యాలలో రాణి అనే పదంలో చివరి అక్షరానికి ( ి ) ఉంది. కాబట్టి **కి** అనే విభక్తి ప్రత్యయం వస్తుంది. అంజు అనే పదంలో చివరి అక్షరానికి (ు) ఉంది. కాబట్టి **కు** అనే విభక్తి ప్రత్యయం వస్తుంది.

**(ఆ) కింది వాక్యాలలోని పదాలకు కి, కు లను సరైన చోట ఉంచండి.**

1) రహీం, మనీషా .... పుస్తకం ఇచ్చాడు.
2) హసీనా ఇంటి .... వెళ్లింది.
3) గీత .... లడ్డూలంటే ఇష్టం.
4) నళిని .... , మస్తాన్ .... అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి.



### నేనివి చేయగలనా ?



| | |
|---|---|
| 1. నేను చూసిన ప్రదేశాల గురించి మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. విహారయాత్ర విశేషాలను ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. ఆధారాలతో ఒక పేరా రాయగలను. | ఔను / కాదు |
| 4. దినచర్య రాయగలను. | ఔను / కాదు |

© SCERT not to be republished

యూనిట్ 3

# అమ్మ ఎవరు?

చదువు - ఆనందించు

కోడిపిల్ల తన తల్లికోసం చూసింది. తల్లి కనిపించలేదు. దానికి దుఃఖం వచ్చింది. ఏడుస్తూ కూర్చుంటే ఏం లాభం? అనుకుంది. అమ్మకోసం వెదకడం ప్రారంభించింది.






బుడిబుడి నడకలతో నడుస్తూండగా దారిలో ఒక ఆవు కనిపించింది. తనవైపే పట్టిపట్టి చూస్తున్న కోడిపిల్లను, "ఏం కావాలమ్మా నీకు?" అని అడిగింది ఆవు. కోడిపిల్ల ముద్దు ముద్దు మాటలతో "నాకు అమ్మ కావాలి!" అంది. ఆవు జాలిపడింది. "మీ అమ్మ నాకంటె చాలా చిన్నగా ఉంటుంది. నేను ఆవును" అని చెప్పింది. "ఓహో, మా అమ్మ నీకంటె చిన్నగా ఉంటుందా?" అని కోడిపిల్ల, ముందుకు వెళ్ళింది. దానికి దారిలో ఒక మేక కనిపించింది. దాని దగ్గరికిపోయి, "నువ్వు ఆవుకంటె చిన్నగా ఉన్నావు. మా అమ్మవు నువ్వేనా?" అని అడిగింది. ఆవుకంటే చిన్నగా ఉన్నాను నిజమేగాని నాకు నాలుగు కాళ్ళు ఉన్నాయి. మీ అమ్మకు నీలాగ రెండే కాళ్ళు ఉంటాయి, రెక్కలు ఉంటాయి," అని చెప్పింది.



కోడిపిల్ల ఆలోచిస్తూ ముందుకు వెళ్ళింది. కొంత దూరంలో 'కావ్ కావ్' అంటూ ఓ కాకి కనపడింది. మేక మాటలు గుర్తుకు తెచ్చుకొని దగ్గరికెళ్ళి నీకు రెండు కాళ్ళు, రెక్కలు ఉన్నాయి. మా అమ్మవు నువ్వేనా?" అని అడిగింది. ఆ కాకి, "నువ్వన్నది నిజమే కానీ నేను చాలా ఎత్తుకు ఎగరగలను. మీఅమ్మ నాకంటే పెద్దగా ఉంటుంది. కాళ్ళు కూడా పొడుగ్గా ఉంటాయి. మీ అమ్మ నాలాగ అరవదు," అంది. ఆ మాటకు కోడిపిల్ల, "అయ్యో!" అనుకుంది. అది గమనించిన కాకి "నువ్వు నిరాశ పడకు. ముందుకు వెళ్ళి చూడు. తప్పకుండా కనిపిస్తుంది, మీ అమ్మ," అని చెప్పి ఎగిరిపోయింది.



కాకి మాటలతో కోడిపిల్లకు ఉత్సాహం వచ్చింది. చెరువు గట్టుమీద నడుస్తూ వెళ్ళింది. 'క్వాక్ క్వాక్' అంటూ బాతు కనపడింది. కాకి చెప్పిన పోలికలు బాతులో కనిపించేసరికి కోడిపిల్ల ఎంతో సంబరపడి, "అమ్మా" అంటూ బాతు దగ్గరికి పరుగెత్తింది. "అయ్యో, తల్లీ! నేను మీ అమ్మను కానమ్మా!" అంది. ఆ మాటలకు కంగుతిన్న కోడిపిల్ల వెక్కి వెక్కి ఏడ్చింది. అది చూసిన బాతు గుండె కరిగింది. లాలనగా, "ఎందుకమ్మా ఏడుస్తున్నావు! చెప్పు!" అని అడిగింది. కోడిపిల్ల జరిగిందంతా చెప్పింది. ఆ మాటలు విన్న బాతు, "మీ అమ్మ నాలాగ అరవదు కొ...క్కొ...కొ...క్కో" అంటుంది అని చెప్పింది.

చెట్టు పైనుంచి సంభాషణ అంతా వింటున్న పావురం, కోడిపిల్లకు సహాయం చేయాలనుకుంది. ఈ చెరువు గట్టు చివరికి వెళ్ళు! అక్కడ మీ అమ్మ కనిపించవచ్చు!" అని చెప్పి వెళ్ళిపోయింది. పావురం చూపించిన దిశగా కోడిపిల్ల వెళ్ళింది. కాస్తంత దూరం వెళ్ళేసరికి 'కొ...క్కొ....కొ...క్కో' అన్న శబ్దం వినిపించేసరికి కోడిపిల్ల ఆనందంగా అటువైపు చూసింది. "రెండు కాళ్ళు, రెండు రెక్కలతో కాకి కంటే పెద్దగా ఉండి 'కొ....క్కొ....కొ....క్కో' అంటున్నది కాబట్టి తప్పకుండా మా అమ్మే అయి ఉంటుంది," అని నిశ్చయించుకొంది.

"అమ్మా! అమ్మా! చిక్...చిక్...చిక్..." అంటూ పిలిచింది. ఆ పిలుపుకు వెనుదిరిగి చూసిన కోడి, కోడిపిల్లను చూసి ఆగింది. తన పిల్లను గుర్తించింది. దగ్గరికి రమ్మంది. కోడిపిల్ల ఆనందానికి అవధులు లేవు. సంతోషంగా చిట్టి చిట్టి రెక్కలతో ఎగురుతూ తన తల్లిని చేరుకుంది.



తనపిల్ల తననే వెదుకుతూ ఎలా చేరుకుందో తెలుసుకోవాలని తల్లికోడి కుతూహలంగా ప్రశ్నించింది పిల్లను. కోడిపిల్ల జరిగిందంతా తల్లికి వివరించింది. ఆ మాటలు విన్న తల్లికోడి, తన పిల్ల తెలివికి, పట్టుదలకు అబ్బురపడింది.

© SCERT not to be republished